


## గోదాదేవికి సారె

మంగళగిరి: ఆత్మకూరు బాపూజీ విద్యాలయ ఆవరణలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం గోదాదేవికి సారె సమర్పించారు.



## ధనుర్మాస పూజలు

వినుకొండ(నూజెండ్ల): ధనుర్మాస ప్రారంభం సందర్భంగా పట్టణంలోని పాత మార్కెట్ వద్ద ఉన్న పురాతన కోదండ రామస్వామి గుడిలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 579.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,086 క్యూసెక్కులు విడుదలవుతోంది.

## న్యూస్‌రీల్

### ఎట్టకేలకు రైతును కలిసిన ఉప ముఖ్యమంత్రి

మంగళగిరి: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి అన్నదాతల సమస్యలు విన్నవించేందుకు అనంతపురం జిల్లా హిందూపురం నుంచి వచ్చిన రైతు నవీన్‌కుమార్‌కు ఎట్టకేలకు పవన్ కళ్యాణ్ దర్శనమిచ్చారు. సాక్షి దినపత్రికలో మంగళవారం 'సమస్యలు పరిష్కరించాలి ఎడ్ల బండి కట్టి' అంటూ ప్రచురితమైన కథనానికి స్పందించిన ఉప ముఖ్యమంత్రి మంగళవారం ఉదయం నవీన్‌కుమార్‌ను కలిశారు. అనంతరం నవీన్ కుమార్ మాట్లాడుతూ.. దళారుల బెడద తప్పించాలని, పంటకు గిట్టుబాటు ధర కల్పించి మార్కెట్‌లో విక్రయించుకునేలా చూడాలని కోరారు. వినతిపత్రాన్ని కార్యాలయంలో ఇవ్వాలని తెలపగా, ఆ మేరకు అందజేసినట్లు తెలిపారు.

### ఎన్‌సీసీ కోటాలో అగ్రిసెట్ ప్రవేశాలకు కౌన్సెలింగ్




గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో ప్రస్తుత విద్యాసంవత్సరానికి బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సుల్లో ఎన్‌సీసీ కోటాలో అగ్రిసెట్ 2024 ద్వారా ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీన కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్‌ను సంప్రదించాలన్నారు.

### 18 నుంచి లెవెల్ క్రాసింగ్ గేటు మూసివేత



లక్ష్మీపురం: మంగళగిరి నుంచి నిడమర్రు వరకు రోడ్డు నిర్మాణ పనుల నేపథ్యంలో మూడు రోజుల పాటు నంబూరు–మంగళగిరి మధ్య లెవెల్ క్రాసింగ్ గేటును మూసి వేయనున్నట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు లెవెల్ క్రాసింగ్ గేటు మూసి వేయడం వల్ల ట్రాఫిక్‌ను డాన్ బాస్కో స్కూల్– నవలూరు సెంటర్ – క్రికెట్ స్టేడియం రోడ్డు –నిడమర్రు మీదుగా మళ్లించనున్నట్లు పేర్కొన్నారు.

### ఉపాధి పనులలో నిర్లక్ష్యం తగదు



మాచర్ల రూరల్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిర్మాణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులందరూ సమష్టిగా పనిచేయాలని పల్నాడు జిల్లా ఏపీడీ కొరటా మల్లికార్జునరావు కోరారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి, కొప్పునూరు, తాళ్ళపల్లి, చింతలతండ, నాగులవరం గ్రామాలలో మినీ గోకులం షెడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. డివిజన్‌లో మినీ గోకులం షెడ్ల నిర్మాణం కోసం తలపెట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రతి ఒక్కరికీ పని కల్పించేలా ఉపాధి హామీ పనులు అందించాలని కోరారు. గ్రామాల అభివృద్ధిలో ఉపాధి హామీ పథకం కీలకమైందని, ఈ పనులను నిర్వాహణలో అలసత్వం ప్రదర్శించవద్దని, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసి జవాబుదారీతనంగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట ఏపీఓ శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్ గోవిందు, ఇంజినీర్ గోపి, ఫీల్డ్ అసిస్టెంటు మరియ దాసు, నాయక్‌లు ఉన్నారు.


### వైభవంగా ఆరుద్రోత్సవం



నరసరావుపేట రూరల్: కోటప్పకొండలో ఆరుద్రోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి ప్రారంభమైన కార్యక్రమంలో త్రికోటేశ్వర స్వామికి మహాన్యాసపూర్వక మహారుద్రాభిషేకాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అభిషేకాలు నిర్వహించారు. చివరగా అన్నాభిషేకం జరిపిన అనంతరం స్వామికి విశేష పుష్పాలంకరణ చేశారు. తెల్లవారుజాము వరకు జరిగిన అభిషేకాలను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

# రాజధానిలో భారీ వడ్డన

- పెరగనున్న భూముల రిజిస్ట్రేషన్ విలువలు
- జనవరి నుంచి అమలుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు





సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాజధాని ప్రాంతంలో భూముల రిజిస్ట్రేషన్ విలువలను భారీగా పెంచేందుకు రంగం సిద్ధమైంది. జనవరి ఒకటి నుంచి ఈ మేరకు అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. ఆదాయం పెంపు కోసం ఎక్కడెక్కడ ఎంతెంత పెంచాలనే దానిపై చర్చిస్తున్నారు. జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషను కార్యాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్ విలువ, బయట మార్కెట్ విలువ తదితర వివరాలు సేకరిస్తున్నారు. ముఖ్యంగా అమరావతి రాజధాని పేరుతో తాడికొండ, పెదకాకాని, అమరావతి, నంబూరు ప్రాంతాల్లో 200–300 శాతం వరకు విలువలు పెంచేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. 2024–25లో జిల్లా రిజిస్ట్రేషన్ల ఆదాయ లక్ష్యం సుమారు రూ.1,100 కోట్లుగా నిర్ణయించారు. దీనికి మించి ఆదాయం రాబట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

### పెంపుదల ఇలా ఉండొచ్చు..

రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న ప్రకారం 10 నుంచి 15 శాతం వరకు పెంచాలని భావిస్తున్నారు. అంటే రూ. లక్ష ఉన్న విలువ జనవరి నుంచి రూ.1.15 లక్షలు అవుతుంది. పొలాలు ఇప్పటికే ఎకరా రూ.20 లక్షలుంటే.. దానిని రూ.50 లక్షల నుంచి రూ.70 లక్షలు చేయాలని సర్కారు భావిస్తోంది. ముఖ్యంగా అమరావతి రాజధాని పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి ఏమాత్రం జరగకపోయినా మసిబూసి మారేడు కాయ చేస్తూ రియల్ ఎస్టేట్ భారీగా పెరిగిపోవడంతో అక్కడ విలువలు పెంచేందుకు పాలకులు సన్నద్ధం అవుతున్నారు. తాడికొండ ప్రాంతంలో ఎకరం రూ.కోటిన్నర నుంచి రూ.ఏడు కోట్ల వరకు పలుకుతుండగా, రిజిస్ట్రేషన్ విలువ మాత్రం ఎకరానికి రూ. 20 లక్షలుగానే ఉంది. దీంతో అక్కడ దీన్ని రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు పెంచేందుకు అవకాశాలను పరిశీలిస్తున్నారు. అపార్ట్‌మెంట్ ఎస్ఎఫ్‌టీ ధర రూ. 3 వేలు నుంచి రూ.4 వేలు వరకు పెంచనున్నారు. జాతీయ రహదారుల సమీపంలోని స్థలాలు, భూములకు కూడా భారీగానే పెంపుదల ఉండనుంది. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఈ విలువలను నిర్ధారించనుంది.

### గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..

2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రిజిస్ట్రేషన్ విలువలు నామమాత్రంగానే పెంచారు. కొన్ని వెనుకబడిన ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు ప్రోత్సహించేందుకు ఉన్న విలువలు కూడా తగ్గించారు. 2016లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం మూడు సార్లు రిజిస్ట్రేషన్ విలువలు పెంచింది. ఇప్పటి వరకు ఒకే ఏడాది మూడు దఫాలుగా ఏ ప్రభుత్వమూ పెంచిన దాఖలాలు లేవు... ఒక్క తెలుగుదేశం ప్రభుత్వం తప్ప! మొదటి నుంచి ప్రజలపై భారాలు వేయడంలో బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మరోసారి అదే తరహాలో భారం మోపనుంది. ఇప్పటికే విద్యుత్ చార్జీల మోతతో అల్లాడిపోతున్న ప్రజలు మరో బాదుడుకు సిద్ధం కావాల్సిన పరిస్థితి నెలకొంది.

### షెడ్యూల్ ఇదీ...

ఈ నెల 18వ తేదీకి మార్కెట్ విలువలను నిర్ధారిస్తారు. 19న ఈ ప్రతిపాదనలను సంబంధిత కమిటీ ఆమోదిస్తుంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, డిపార్టుమెంట్ వెబ్‌సైట్‌లో ఈ వివరాలను అభ్యంతరాలు, సూచనల కోసం ఉంచుతారు. వాటిని 24వ తేదీలోగా స్వీకరిస్తారు. మార్పుచేర్పులు ఉంటే 26లోగా పూర్తి చేస్తారు. 27వ తేదీన తుది ఆమోదం కోసం మళ్లీ కమిటీ ముందు ఉంచుతారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి కొత్త విలువలు అమలులోకి వస్తాయి.

# తోబుట్టువే తోడేలై



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎం.హనుమంతరావు, చిత్రంలో సీఐ సుబ్బారావు, ఎస్ఐ సురేష్

- డబ్బు కోసమే సోదరుల హత్య
- దర్యాప్తులో తేల్చిన పోలీసులు
- ఆరుగురు నిందితుల అరెస్టు

నకరికల్లు: తోబుట్టువే తోడేలైంది. డబ్బుపై వ్యామోహంతో రక్తసంబంధాన్ని మరిచి సొంత సోదరులను పథకం ప్రకారం హతమార్చింది. మృతుల్లో ఒకరు కానిస్టేబుల్ కావడం, అతను విధులకు హాజరుకాకపోవడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు కేసు మిస్టరీని ఛేదించారు. సొంత సోదరే అన్న, తమ్ముడిని చంపిందని తేల్చారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. నకరికల్లులో కలకలం రేపిన ఈ కేసు వివరాలను డీఎస్పీ ఎం.హనుమంతరావు మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. నకరికల్లుకు చెందిన గిరిజన పాఠశాల ఉపాధ్యాయుడు తలపాల పోలురాజు అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనకు ముగ్గురు సంతానం గోపీకృష్ణ పెద్ద కొడుకు. రెండో సంతానం కృష్ణవేణి. దుర్గారామకృష్ణ చిన్నకొడుకు. కృష్ణవేణికి పెళ్లయి కూతురు ఉంది. భర్తను వదిలి పుట్టింట్లోనే ఉంటుంది. గోపీకృష్ణ, దుర్గారామకృష్ణ కూడా భార్యలతో విడిపోయారు. ఈ క్రమంలో తండ్రి మరణంతో ప్రభుత్వం నుంచి వచ్చే రూ.70లక్షలు తనకే చెందాలని కృష్ణవేణి డిమాండ్ చేసింది. దీనికి గోపీకృష్ణ, దుర్గారామకృష్ణ అంగీకరించలేదు. దీంతో ఘర్షణ పడుతూ వచ్చారు. అన్న, తమ్ముడి అడ్డు తొలగించుకుంటే డబ్బుతోపాటు తండ్రి వారసత్వంగా ఉద్యోగం వస్తుందని అత్యాశకు పోయిన కృష్ణవేణి సోదరుల హత్యకు పథకం రూపొందించింది. అలాగే ఈనెల 10న రాత్రి కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అన్న గోపీకృష్ణ హత్యకు కృష్ణవేణి మరో ఇద్దరు మైనర్లతో కలిసి పథకం వేసింది. చెరో రూ.పదివేలు ఇస్తానని బేరం కుదుర్చుకుంది. అన్న గోపీకృష్ణకు కూడా మద్యం తాగించి మెడకు వైరు బిగించింది. వైరు తెగినా ఆగకుండా చున్నీ తో మెడను బిగించి ఊపిరాడకుండా చేసింది. చనిపోయాడని నిర్ధారించుకున్నాక దానయ్య మోటార్‌సైకిల్‌పై మృతదేహాన్ని తీసుకెళ్లి గుంటూరు బ్రాంచి కెనాల్‌లో మైనర్లు పడేశారు.

### సహజీవనం చేస్తున్న వ్యక్తి సహకారంతో..

రెండేళ్లుగా తనతో సహజీనం చేస్తున్న మల్లా దానయ్య సహకారంతో స్థానికంగా ఉండే ఇద్దరు మైనర్లతో కలిసి నవంబర్ 26న తమ్ముడు దుర్గా రామకృష్ణను చంపేందుకు ప్రణాళిక వేసింది. మైనర్ యువకులకు చెరొక రూ.10వేలు ఇస్తానని బేరం కుదుర్చుకుంది. అదేరోజు రాత్రి 10 గంటల సమయంలో దుర్గారామకృష్ణకు మద్యం తాగించి చున్నీతో గొంతు బిగించి చంపారు. తర్వాత మైనర్లు దానయ్య మోటారు సైకిల్‌పై దుర్గారామకృష్ణ మృతదేహాన్ని తీసుకెళ్లి అక్షర స్కూల్ వద్ద గోరంట్ల కాలువలో పడేశారు.

### నేరాంగీకారం

హత్యలు చేసింది తానేనని నిందితురాలు ఒప్పుకోవడంతో ఆమెకు సహకరించిన నలుగురు మైనర్లతోపాటు కృష్ణవేణి, దానయ్యలను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని కోర్టుకు హాజరుపర్చినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి రూర ల్ సీఐ సుబ్బారావు, ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

# చైన్ స్నాచర్ల హల్‌చల్



తాడేపల్లి కొత్తూరు ఆంజనేయస్వామి గుడి సమీపంలో స్నాచింగ్



ఆంధ్రరత్న పంపింగ్ స్కీం సమీపంలో గొలుసు లాక్కెళుతున్న దొంగలు

- తాడేపల్లి స్టేషన్ పరిధిలో రెండు చోట్ల గొలును దోపిడీలు
- రోడ్డుపైకి రావాలంటేనే భయపడుతున్న మహిళలు

తాడేపల్లి రూరల్: రాష్ట్రపతి మంగళగిరికి రావడంతో విజయవాడ – గుంటూరు మార్గంలో మంగళవారం బందోబస్తుకు పోలీసులు వెళ్లారు. ఈ హడావుడిలో ఉన్న పోలీసులను గమనించిన చైన్ స్నాచర్లు మంగళవారం నిమిషాల వ్యవధిలో రెండు ప్రాంతాల్లో మహిళల మెడలోని బంగారు చైన్‌లు లాక్కొని పల్సర్ బైక్‌పై పరారయ్యారు. సేకరించిన వివరాల ప్రకారం... తాడేపల్లి వైఎస్సార్ సెంటర్ (కొత్తూరు) ఆంజనేయస్వామి గుడి సమీపంలో నివాసముండే దొంతిరెడ్డి సుగుణ (60) రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్నారు. ఇద్దరు యువకులు పల్సర్ బైక్‌పై వచ్చి ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారపు నానుతాడును తెంచుకు వెళ్లారు. ఈ ఘటన ఉదయం 8.30 నిమిషాలకు జరిగింది. 8.58 నిమిషాలకు కుంచనపల్లి బైపాస్‌రోడ్‌లోని ఆంధ్రరత్న పంపింగ్ స్కీం రోడ్డులో బైపాస్ వైపు నడుచుకుంటూ వెళుతున్న స్రవంతి మెడలోని 4 సవర్ల బంగారు చైన్‌ను అదే దుండగులు లాక్కెళ్లారు. ఈ ఘటనలో సుగుణ కింద పడడంతో గాయాలు అయ్యాయి. మహిళల వద్ద వాహనాలు టర్న్ తీసుకుంటున్నట్లు నటించి స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. ఒక వ్యక్తి హెల్మెట్ పెట్టుకోగా, రెండవ వ్యక్తి ముఖానికి మాస్క్ పెట్టుకున్నాడు. స్నాచర్లు బైపాస్‌రోడ్డు ఎక్కి పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్న ప్రాంతం నుంచి పరారయ్యారు. గత నెల రోజుల్లో తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ తరహా ఘటనలు మూడు జరిగాయి. నెల క్రితం వైఎస్సార్ సెంటర్ కొత్తూరులో మహిళ మెడలో చైన్ స్నాచింగ్ చేసేందుకు ప్రయత్నించగా ఆమె ప్రతిఘటించడంతో దుండగులు పరారయ్యారు.

# వివాహంలో వివాదం



ఘటన చోటు చేసుకున్న ఎన్‌సీసీ పార్క్ స్క్వేర్ అపార్ట్‌మెంట్

- భారీగా మొహరించిన పోలీసులు
- పట్టాభిపురంలో టెన్షన్...టెన్షన్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : వేరే రాష్టానికి చెందిన ఐపీఎస్ అధికారి, తెలంగాణ మాజీ ఎమ్మెల్యే కుమార్తెకు పెద్దలు కుదిర్చిన వివాహం పెళ్లి కుమారుడు తరఫున వారు సమయానికి కారు పంపించకపోవడంతో ఆగిపోయిన ఘటన మంగళవారం అర్ధరాత్రి గుంటూరులోని పట్టాభిపురంలో చోటు చేసుకుంది. దీంతో పెళ్లికుమార్తె తరఫువారు పెళ్లికుమారుడి ఇంటి మీదకు గొడవకు రావడంతో గుంటూరు పట్టాభిపురం ఉమామహేశ్వర కాలనీలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. మంగళవారం పెళ్లి కుమార్తె, పెళ్లి కుమారుడు ఇంటికి వచ్చి మధ్యాహ్నం 3.30 గంటలకు రింగురోడ్డు లోని డాన్ బోస్కో చర్చిలో ఉంగరాలు మార్చుకొని వివాహం చేసుకోవాల్సి ఉంది. వారి సంప్రదాయం ప్రకారం పెళ్లి కొడుకు కారు పంపించాల్సి వుంది. సమయానికి కారు పంపించలేదనే కారణంతో వివాదం ముదిరి వివాహం ఆగిపోయింది. దీంతో పెళ్లి కుమార్తె తరఫు బంధువులు రాత్రి 10:30 గంటల సమయంలో సుమారు 200 మంది పెళ్లి కొడుకు ఇంటివద్దకు చేరుకున్నారు. దీంతో పెళ్లి కొడుకు తరఫువారు పోలీసులను ఆశ్రయించారు. ఐపీఎస్ అధికారి కావడంతో గుంటూరు నగరంలో వున్న డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు భారీగా మోహరించారు. పెళ్లి కుమార్తె తరఫున టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలీ పెళ్లి కొడుకు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్నారు.. అర్ధరాత్రి వరకు ఈ వివాదం పరిష్కారం కాలేదు.

# అత్యవసరం... అత్తెసరే!

రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి విపత్తుల్లో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి సకాలంలో మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడేందుకు గుంటూరు జీజీహెచ్‌లో క్యాజువాల్టీ ఉంది. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించిన ట్రామా కేర్ సెంటర్, గత ప్రభుత్వంలో నూతనంగా మంజూరు చేసిన ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం కూడా ఉన్నాయి. చెప్పుకోవడానికి ఇన్ని ఉన్నా ఇక్కడ చికిత్స కోసం వచ్చే బాధితులకు అరకొర వైద్య సేవలే అందుతున్నాయి. చికిత్సలు సకాలంలో లభించక ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లడమో, ప్రాణాలు కోల్పోవడమో జరుగుతోంది.

- గుంటూరు జీజీహెచ్‌లో తప్పని ఎదురు చూపులు
- మూడు వైద్య విభాగాలున్నా ప్రయోజనం శూన్యం
- ప్రాణాలు కాపాడే ఎమర్జెన్సీ వార్డు నిర్వహణపై విమర్శలు
- పాలకులు దృష్టి సారిస్తేనే రోగుల ప్రాణాలకు భరోసా



గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర విభాగం

గుంటూరు మెడికల్: గతంలో గుంటూరు జీజీహెచ్‌లో రోడ్డు ప్రమాద బాధితులకు, కత్తిపోట్లకు గురైన వారికి, పాము కాటు బాధితులకు, ఇతర అత్యవసర వైద్య సేవలు అందించేందుకు క్యాజువాల్టీ మాత్రమే ఉండేది. జీజీహెచ్‌లో డాక్టర్ పొదిల ప్రసాద్ సూపర్ స్పెషాలిటీ భవన నిర్మాణ సమయంలో 2010లో కేంద్ర ప్రభుత్వం ప్రతి జిల్లాకు రోడ్డు ప్రమాద బాధితులకు ఎమర్జెన్సీ ట్రీట్‌మెంట్ అందించేందుకు ట్రామాకేర్ సెంటర్లను మంజూరు చేసింది. దీని కోసం ప్రత్యేకంగా నిధులు, వైద్య పరికరాలు, సిబ్బందిని కేంద్రం కేటాయించింది. ట్రామా కేర్ సెంటర్‌లో న్యూరో సర్జరీ, ఆర్థోపెడిక్ లాంటి స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యులను సైతం నియమించింది. మెరుగైన వైద్యం సకాలంలో అందించి, ప్రాణాలు కాపాడేందుకు ట్రామా కేర్ సెంటర్ వైద్యులు పనిచేయాల్సి ఉంటుంది.

### పోస్టుల భర్తీకి చర్యలేవీ?

గుంటూరు జీజీహెచ్ ట్రామా కేర్ సెంటర్‌లో 71 పోస్టులకు గాను 20 పోస్టులు రెండేళ్లకుపైగా ఆసుపత్రి అధికారులు భర్తీ చేయలేదు. గత ప్రభుత్వం ప్రతినెలా జీరో వేకెన్సీ పాలసీతో ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయమని చెప్పినప్పటికీ జీజీహెచ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారనే తీవ్ర విమర్శలకు ఉన్నాయి. వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టుల ఖాళీలతో సేవల్లో కొంత మేరకు జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న వైద్య సిబ్బందితో పనిచేయించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో ట్రామాకేర్ సిబ్బంది సొంత ప్రాక్టీస్‌లో మునిగి తేలుతూ జీజీహెచ్‌కు వచ్చే బాధితులపై చిన్నచూపు చూస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆపరేషన్ థియేటర్ ఉన్నప్పటికీ దానిని వినియోగించడం లేదు. సకాలంలో ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడాల్సిన థియేటర్ నిర్వహణలో నిర్లక్ష్యమే అధికారుల పనితీరుకు ఒక నిదర్శనంగా చెప్పవచ్చు.

### సీఎంఓలు ఉన్నా ప్రయోజనం శూన్యం

క్యాజువాల్టీలో ప్రమాద బాధితులు, అత్యవసర చికిత్స బాధితులు రాగానే క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ) సదరు రోగికి ప్రాథమిక చికిత్స అందించాలి. మెరుగైన చికిత్స కోసం స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యులను, డ్యూటీ అసిస్టెంట్ ఫిజీషియన్, డ్యూటీ అసిస్టెంట్ సర్జన్‌లను ఫోన్ కాల్ ద్వారా క్యాజువాల్టీకి పిలిపించి చికిత్స చేయాల్సి ఉంటుంది. రోగి, బాధితులు కొంత మేర కుదటపడిన తర్వాత మెడికో లీగల్ కేసులకు (ఎంఎల్సీ) డాక్యుమెంటేషన్ సిద్ధం చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలి. క్యాజువాల్టీలో సీఎంఓలుగా విధులు నిర్వహిస్తున్న వారు కేవలం మెడికల్ సర్టిఫికెట్లు ఇచ్చి జేబులు నింపుకొనే పనిలో ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎంఎల్సీ కేసులు క్యాజువాల్టీకి వచ్చినప్పుడు పోలీసు సమాచారం మాత్రం సిద్ధం చేసి, మిగతా చికిత్సలు తమకు సంబంధం లేదన్నట్లుగా బాధితులను వేచి చూసేలా చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. దీంతో ఎమర్జెన్సీ చికిత్సల కోసం వచ్చే రోగుల ప్రాణాలకు గ్యారంటీ ఉండటం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది. క్యాజువాల్టీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

### మెరుగైన వైద్య సేవలకు చర్యలు

జీజీహెచ్‌లో ఎమర్జెన్సీ చికిత్స కోసం వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ తెలిపారు. ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌ను సైతం వారం రోజుల్లో ప్రారంభిస్తామని చెప్పారు. ఆపరేషన్లు కూడా సత్వరమే జరిగేలా చూస్తామన్నారు.

– సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ




### గంటల తరబడి వేచి చూడాల్సిందే..

ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ద్వారా నాన్ ఎంఎల్సీ కేసులకు సత్వర చికిత్స అందించి ప్రాణాలు కాపాడాల్సి ఉంది. కానీ పూర్తి స్థాయిలో ఈ పనిచేయడం లేదనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. వైద్యులు తమ సొంత ప్రాక్టీస్‌లో ఉండి జీజీహెచ్‌కు వచ్చే రోగులను అశ్రద్ధ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అందుకు నిదర్శనం క్యాజువాల్టీలో గంటల కొద్దీ.. కొన్ని సందర్భాల్లో రోజుల తరబడి రోగులు వేచి ఉండాల్సిన దుస్థితి ఉంది. సీసీ కెమెరాల్లో ఈ విషయాలు రికార్డు అయి ఉంటాయి. అయినప్పటికీ ఎలాంటి భయాలు లేకుండా క్యాజువాల్టీ, ట్రామాకేర్, ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు, వైద్య సిబ్బంది సత్వర సేవలు అందించడంలో జాప్యం చేస్తున్నారు.

## క్లుప్తంగా

### ఎంబీటీఎస్‌లో క్రీడా పోటీలు ప్రారంభం



గుంటూరు రూరల్: నల్లపాడులోని ఎంబీటీఎస్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఐపీఎస్‌జీఎం 2024 పేరుతో ఏర్పాటు చేసిన క్రీడాపోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి, చలపతి మెటల్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పి. వెంకటేశ్వరరావులు బెలూన్‌లు ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలంటే విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. క్రీడలు నిర్వహిస్తున్న సాంకేతిక విద్యా శాఖ డైరెక్టర్ గణేష్‌కుమార్‌కి ప్రిన్సిపల్ టి.శేఖర్ ధన్యవాదాలు తెలిపారు. జిల్లా రీజినల్ స్పోర్ట్స్‌కు జిల్లా వ్యాప్తంగా 19 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 418 మంది నమోదు చేసుకున్నట్లు చెప్పారు. విజేతలకు బుధవారం బహుమతులు ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో క్రీడాకారులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

### రాణించిన రాజస్థాన్ బౌలర్లు

**204 పరుగులకు విదర్భ ఆలౌట్**

మంగళగిరి: నగర పరిధిలోని అమరావతి టౌన్‌షిప్‌లో ఉన్న అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న విజయ్ మర్చంట్ ట్రోఫీ అండర్–16 క్రికెట్ మ్యాచ్‌లో మంగళవారం రాజస్థాన్ బౌలర్లు రాణించారు. రాజస్థాన్, విదర్భ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విదర్భ జట్టు 73.4 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌటైంది. విదర్భ బ్యాట్స్‌మెన్ ఓంధోర్ 132 బంతులలో 12 ఫోర్లతో 70 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కష్యప్ రత్నాకర్ 35 పరుగులతో రాణించాడు. రాజస్థాన్ బౌలర్లు పి ద్వాదాల్, సుజాల్ పర్మార్, ఆదిత్యలు మూడేసి వికెట్లు తీసి సత్తా చాటారు.

### వివాహంలో వివాదం

- భారీగా మొహరించిన పోలీసులు
- పట్టాభిపురంలో టెన్షన్...టెన్షన్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : వేరే రాష్ట్రానికి చెందిన ఐపీఎస్ అధికారి, తెలంగాణ మాజీ ఎమ్మెల్యే కుమార్తెకు పెద్దలు కుదిర్చిన వివాహం పెళ్లి కుమారుడు తరఫున వారు సమయానికి కారు పంపించకపోవడంతో ఆగిపోయిన ఘటన మంగళవారం అర్ధరాత్రి గుంటూరులోని పట్టాభిపురంలో చోటు చేసుకుంది. దీంతో పెళ్లికుమార్తె తరఫువారు పెళ్లికుమారుడి ఇంటి మీదకు గొడవకు రావడంతో గుంటూరు పట్టాభిపురం ఉమామహేశ్వర కాలనీలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. మంగళవారం పెళ్లి కుమార్తె, పెళ్లి కుమారుడు ఇంటికి వచ్చి మధ్యాహ్నం 3.30 గంటలకు రింగురోడ్డులోని డాన్ బోస్కో చర్చిలో ఉంగరాలు మార్చుకొని వివాహం చేసుకోవాల్సి ఉంది. వారి సంప్రదాయం ప్రకారం పెళ్లి కొడుకు కారు పంపించాల్సి వుంది. సమయానికి కారు పంపించలేదనే కారణంతో వివాదం ముదిరి వివాహం ఆగిపోయింది. దీంతో పెళ్లి కుమార్తె తరఫు బంధువులు రాత్రి 10:30 గంటల సమయంలో సుమారు 200 మంది పెళ్లి కొడుకు ఇంటివద్దకు చేరుకున్నారు. దీంతో పెళ్లి కొడుకు తరఫువారు పోలీసులను ఆశ్రయించారు. ఐపీఎస్ అధికారి కావడంతో గుంటూరు నగరంలో వున్న డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు భారీగా మోహరించారు. పెళ్లి కుమార్తె తరఫున టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలీ పెళ్లి కొడుకు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్నారు.. అర్ధరాత్రి వరకు ఈ వివాదం పరిష్కారం కాలేదు.

# పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

- ఇంటర్మీడియెట్, టెన్త్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదల
- సన్నద్ధమవుతున్న విద్యార్థులు
- టెన్త్ స్టడీ మెటీరియల్ అందజేతలో జెడ్పీ పాలకవర్గం నిర్లక్ష్యం
- సకాలంలో అల్పాహారం అందజేతకు చర్యలు శూన్యం



తరగతి గదిలో టెన్త్ విద్యార్థినులు (ఫైల్)

**ఇంటర్ విద్యార్థుల వివరాలు...**

| | ప్రథమ ఏడాది | ద్వితీయ ఏడాది |
|---|---|---|
| ఆర్ట్స్, సైన్స్ | 33,527 | 29,875 |
| ఒకేషనల్ | 876 | 751 |
| మొత్తం విద్యార్థులు | 65,029 | |

గుంటూరు ఎడ్యుకేషన్ : పదో తరగతి, ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు షెడ్యూల్ విడుదల కావడంతో జిల్లాలో పరీక్షల హడావుడి మొదలైంది. మార్చి ఒకటి నుంచి ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలను నిర్వహించేందుకు ఇంటర్ బోర్డు తాజాగా షెడ్యూల్ విడుదల చేసింది. గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల నుంచి ఇంటర్‌లో 65,029, మార్చి 17 నుంచి జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు 27,455 మంది హాజరు కానున్నారు. టెన్త్‌లో 879 మంది గతంలో అనుత్తీర్ణులైనవారు, ప్రైవేటు విద్యార్థులు ఉన్నారు.

**అదనపు తరగతుల నిర్వహణ**

టెన్త్, ఇంటర్మీడియెట్ విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేస్తూ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు విద్యాశాఖ విడుదల చేసిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నారు.

**స్టడీ మెటీరియల్, అల్పాహారమేది?**

ప్రభుత్వ పాఠశాలల టెన్త్ విద్యార్థులకు జిల్లా పరిషత్ పాలకవర్గం గత రెండు విద్యాసంవత్సరాల్లో నిపుణులైన ఉపాధ్యాయులచే రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను అందించింది. జగనన్న విద్యాజ్యోతి పేరుతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పంపిణీ చేసింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలోనూ దానిని కొనసాగిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, స్టడీ మెటీరియల్‌ను సిద్ధం చేయడంలో విఫలమైంది. గత రెండేళ్లపాటు ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్యాల్లోని టెన్త్ విద్యార్థులకు సాయంత్రం వేళల్లో అల్పాహారాన్ని అందించేందుకు నిధులు విడుదల చేశారు. ప్రస్తుతం జెడ్పీ పాలకవర్గం దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఫలితంగా అదనపు తరగతులకు విద్యార్థులు అర్ధాకలితోనే హాజరు కావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

# విద్యుత్ చార్జీల భారం తగ్గించాలి

**సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ**



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కొరిటెపాడు (గుంటూరు): కరెంటు చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల్లో కూటమి హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక ఆ మేరకు కట్టుబడి ప్రజలపై విద్యుత్తు చార్జీల భారం తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. ప్రజలపై భారం మోపే ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు, విద్యుత్ సర్దుబాటు చార్జీలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పొన్నూరు రోడ్‌లోని విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ... సర్దుబాటు చార్జీల పేరుతో, స్మార్ట్ మీటర్లు పెడతామంటూ ప్రజలపై భారం వేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే రూ.15,486 కోట్ల భారం వేయడం అమానుషమని మండిపడ్డారు. పార్టీ నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్ల మార్పు వినియోగదారులకు తీవ్ర నష్టమన్నారు. దీనికోసం నెలకు రూ.100 నుంచి రూ.150 వరకు వాయిదాల పద్ధతిలో మొత్తం రూ.10 వేలు నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తారని ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ముక్కలు చేసి ప్రైవేటు వ్యక్తులకు ఇప్పటికే అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, వృత్తిదారులు, వ్యవసాయానికి రాయితీలు క్రమంగా తొలగించనున్నట్లు ఆరోపించారు. డిమాండ్లపై విద్యుత్ శాఖ సీనియర్ అసిస్టెంట్ పాశం రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.భావన్నారాయణ, ఈమని అప్పారావు, ముత్యాలరావు, డి.లక్ష్మీనారాయణ, డి.శ్రీనివాసరావు, షేక్ మస్తాన్, లక్ష్మణరావు, ఖాసిం సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# మనసున్న మహారాజు పీవీజీ రాజు



పాటిబండ్ల విష్ణువర్ధన్‌ను సత్కరిస్తున్న అశోక్ గజపతి రాజు, బుద్ధ ప్రసాద్, గజల్ శ్రీనివాస్

**ఘనంగా డాక్టర్ పి.వి.జి.రాజు విద్యా పురస్కారాలు ప్రదానం**

నగరంపాలెం: డాక్టర్ పి.వి.జి.రాజు మంచి మనసున్న మహారాజు అని కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు అన్నారు. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మంగళవారం డాక్టర్ పి.వి.జి.రాజు శత జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా అశోక్ గజపతి రాజు మాట్లాడుతూ.. పి.వి.జి.రాజు దాతృత్వానికి నిలువుటద్దమని చెప్పారు. అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి దాతృత్వం ఉన్న వ్యక్తి అని... డాక్టర్ పి.వి.జి.రాజు శత జయంతి వేడుకలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి ప్రసంగిస్తూ డాక్టర్ పి.వి.జి.రాజు తన కోటలను, ప్యాలెస్‌లను విద్యాసంస్థల కు అందించారని అన్నారు. ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ ప్రసంగిస్తూ పి.వి.జి.రాజు 250 ఎకరాల ప్యాలెస్‌ను కోరుకొండ సైనిక్ స్కూల్‌కి విరాళంగా ఇచ్చారని గుర్తుచేశారు. అనంతరం డాక్టర్ పి.వి.జి.రాజు విద్యా పురస్కారాలను శారదానికేతన్ వ్యవస్థాపకుడు ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ దంపతుల వారసురాలు వి.హేమ, శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ వ్యవస్థాపకుడు పాటిబండ్ల సీతారామయ్య మనువడు విష్ణువర్ధన్‌కు, హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ ఆల్ (హీల్ ) వ్యవస్థాపకుడు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్‌లకు అశోక్ గజపతి రాజు అందించారు. అనంతరం పెనుమెత్స నాగరాజు సహకారంతో ప్రచురించిన పూసపాటి రాజుల పూర్వోత్తరం చారిత్రక గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఆర్.రాజేష్, పీవీ రమణ బృందం అభ్యుదయ గేయలాపన చేశారు. మానవత నేతలు పావులూరి రమేష్, టి.ధనుంజయరెడ్డి, రెడ్ క్రాస్ జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ షేక్ జానీ రసూల్, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, ఇండియన్ టొబాకో అసోసియేషన్ కార్యదర్శి యార్లగడ్డ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ అధికారుల తీరు ఆక్షేపణీయం



లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులను ఉద్యమాల వైపు అధికారులే బలవంతంగా నెడుతున్నారని ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర రావు అన్నారు. గుంటూరులోని కొత్తపేటలో ఉన్న జిల్లా సీపీఐ కార్యాలయం మల్లయ్య లింగంభవన్‌లో మంగళవారం ఈయూ జిల్లా స్థాయి విస్తృత కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు షేక్ కరీముల్లా అధ్యక్షతన జరిగింది. ఇందులో దామోదరరావు మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నెల్లూరు జోనల్ కార్యదర్శి దాసరి బాబూ శామ్యూల్, జిల్లా కార్యదర్శి ఇ.విజయ్ కుమార్, స్టేట్ మెయింటెనెన్సు కమిటీ మెంబర్ ధనుంజయరెడ్డి, నాయకులు డి.వి.స్వామి, ఎ.పి.రావు, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

### యార్డుకు 59,536 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 59,536 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 56,202 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,300 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 14,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 46,133 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

# వైద్య విద్యార్థులకు క్రికెట్ ప్రాక్టీస్ కోర్ట్

- 1999 ఎంబీబీఎస్ బ్యాచ్ దాతృత్వం
- రూ. 10 లక్షలతో ఏర్పాటు
- పలు అభివృద్ధి పనులకు రూ.2 కోట్లు



క్రికెట్ ఆడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి, చిత్రంలో పూర్వ విద్యార్థులు

గుంటూరు మెడికల్ : గుంటూరు వైద్య కళాశాల 1999 బ్యాచ్ విద్యార్థుల సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలిచాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగార్జున కొండ వెంకట సుందరాచారి అన్నారు. మంగళవారం గుంటూరు అమరావతి రోడ్డులోని మెడికల్ కాలేజ్ మెన్స్ హాస్టల్‌లో క్రికెట్ ప్రాక్టీస్ కోర్టులను ఆయన ప్రారంభించారు. 1999 బ్యాచ్‌కు చెందిన బాహుబలి సర్జన్, బ్రింద హాస్పటల్ అధినేత డాక్టర్ భవనం హనుమశ్రీనివాసరెడ్డి, అమెరికాలో స్థిరపడిన డాక్టర్ పుణ్యాల శ్రీనివాసరెడ్డిలు క్రికెట్ ప్రాక్టీస్ కోర్టులు మూడు నిర్మించేందుకు రూ. 10 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ఇప్పటికే ఈ బ్యాచ్ వారు రూ. 80 లక్షలతో రెండు బస్సులు ఇచ్చారని, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కళాశాలలో పలు విభాగాల అభివృద్ధి కోసం రూ. 2 కోట్లు విరాళంగా ఇచ్చారని చెప్పారు. డాక్టర్ భవన హనుమ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తమ బ్యాచ్‌మెట్ కొప్పురావూరి హరికిరణ్ జ్ఞాపకార్థంగా ఈ కోర్టును నిర్మించామన్నారు. తమ బ్యాచ్ ఎంబీబీఎస్ కోర్సు అభ్యసించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రీ యూనియన్ ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. ప్రిన్సిపల్ సూచనతో రూ.రెండు కోట్ల విరాళాలు సేకరించామని వెల్లడించారు. తమ బ్యాచ్‌కు చెందిన వైద్యులు ప్రణతి, లావణ్య, పవన్, సంతషేలు అకాల మృతి చెందారని.. వారి జ్ఞాపకార్థంగా మెన్స్ హాస్టల్‌కు రెండు వాషింగ్ మెషిన్లు విరాళంగా ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో 1999 బ్యాచ్‌కు చెందిన వైద్యులు సునీల్‌కుమార్ నాయక్, కందుల రాము, సుధీర్, గుత్తి నాగేశ్వరరావు, సుబ్బరాయణం, గోపాటి నాగేశ్వరరావు, రవి, వైస్ ప్రిన్సిపల్స్ ప్రభాకర్, శ్రీధర్, హాస్టల్ వార్డెన్, ఫోరెన్సిక్ ప్రొఫెసర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# నగదు తిరిగివ్వలేదని యువకుడి దారుణ హత్య



దీపక్ మృతదేహం

పట్నంబజారు: నగదు తిరిగి ఇవ్వలేదని ఓ యువకుడిని కొందరు కొట్టి చంపిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెనాలిలోని చెంచుపేటలో నివాసం ఉండే చప్పిడి దీపక్ (27)కు గద్దల కిరణ్ స్నేహితుడు. ఇద్దరూ మద్యం తాగి తిరుగుతుండేవారు. కిరణ్ కొద్ది కాలం క్రితం గుంటూరుకు వచ్చి ఎస్వీఎస్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఏప్రిల్‌లో తెనాలిలో దీపక్, కిరణ్ మద్యం తాగారు. కిరణ్ మత్తులో ఉండగా అతడి ఫోన్ నుంచి దీపక్ రూ. 53 వేలు తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. దీనిపై ఇద్దరూ గొడవ పడ్డారు. దీపక్ తండ్రి చంద్రశేఖరరావు దఫాలుగా ఆ మొత్తం తిరిగి ఇస్తానని చెప్పాడు. కానీ ఇవ్వకపోవటంతో దీపక్‌ను భయపెట్టి డబ్బులు తీసుకోవాలని కిరణ్ నిర్ణయించుకున్నాడు. నాలుగు రోజులుగా తెనాలి వెళుతూ దీపక్‌తో కలిసి మద్యం తాగుతూ మంచి చేసుకున్నాడు. ఈ నెల 16వ తేదీన రాత్రి కూడా మద్యం తాగించి, గుంటూరులో ఇంత కంటే మంచి పార్టీ ఉందని నమ్మబలికి తీసుకొచ్చాడు. పాతగుంటూరు బాలాజీనగర్ సమీపంలోని రాజీవ్ గృహకల్ప సముదాయం సమీపంలోని ఖాళీ స్థలంలోకి చేరుకున్నారు. అప్పటికే గుంటూరులో కిరణ్ స్నేహితులైన రవి, అక్బర్, అశోక్, గోపిలతో కలిసి పక్కా ప్లాన్ సిద్ధం చేశాడు. డబ్బులు ఇవ్వకుంటే హతమార్చాలనే నిర్ణయంతో వారు ఉన్నారు. ఈ క్రమంలో కర్రలతో దీపక్‌ను ఇష్టానుసారం కొట్టి ఓ ఆటో మాట్లాడి గుంటూరు ప్రభుత్వాసుపత్రికి పంపారు. అతడి పేరు వెంకటరెడ్డి అని ఆటోవాలాకు చెప్పారు. ఏ ఒక్కరూ ఆసుపత్రి దగ్గరకు రాలేదు. దీంతో రాత్రి 2 గంటల సమయంలో ఆటో డ్రైవరు ఆసుపత్రిలో దీపక్‌ను చేర్చి వెళ్లిపోయాడు. తీవ్ర గాయాలకు చికిత్స పొందుతూ దీపక్ తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో మృతి చెందాడు. జీజీహెచ్‌లోని అవుట్‌పోస్ట్ నుంచి సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పాత గుంటూరు పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో వై. వీరసోమయ్య మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే నిందితులు పోలీసులు అదుపులో ఉన్నట్లు తెలిసింది. దీపక్ సోదరుడు తరుణ్ కూడా కొద్ది సంవత్సరాల క్రితం తెనాలిలో హత్యకు గురైనట్లు పోలీసులు తెలిపారు.

# వీవీఐటీని సందర్శించిన అశోక్ గజపతిరాజు



చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్‌తో మాట్లాడుతున్న అశోక్ గజపతిరాజు

పెదకాకాని: కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు మంగళవారం నంబూరు వీవీఐటీ కళాశాలను సందర్శించారు. గుంటూరు విజ్ఞాన మందిరంలో జరిగిన విజయనగరం మహారాజు డాక్టర్ పీవీజీ రాజు శతజయంతి వేడుకలకు పూసపాటి హాజరయ్యారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల 33వ పుస్తక ప్రచురణ పూసపాటి రాజుల యొక్క పూర్వోత్తరం హాకీకత్తు పూసపాటి విజయరామరాజు గ్రంథం ఆవిష్కరించిన అనంతరం వీవీఐటీ కళాశాలను సందర్శించారు. పూసపాటి అశోక్ గజపతి రాజుకు వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ స్వాగతం పలికారు. జనచైతన్య వేదిక సహకారంతో ప్రచురించిన ఈ పుస్తకంలో పూసపాటి వారు ఏవిధంగా విజయనగం రాజులు అయ్యారనేది సంపాదకుడు మోదుగుల రవికృష్ణ పొందుపరిచారు. అశోక్ గజపతిరాజు వీవీఐటీ ఇప్పటి వరకు ప్రచురించిన పుస్తకాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీవీఐటీ వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, సెక్రటరీ సూర్యదేవర బదరీప్రసాద్, జాయింట్ సెక్రటరీ మమిళ్లపల్లి శ్రీకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

# డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఏకగ్రీవం

తెనాలి: కృష్ణా పశ్చిమ డెల్టాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల ప్రక్రియలో భాగమైన డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది. డెల్టాలోని గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలోని 144 సాగునీటి సంఘాలకు ఈ నెల 14వ తేదీన ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. రెండో దశలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)ల ఎన్నికలను మంగళవారం నిర్వహించారు. పశ్చిమ డెల్టాలో గుంటూరు జిల్లాలో ఆరు, బాపట్ల జిల్లా పరిధిలో 14, గుంటూరు చానల్ పరిధిలో 2 డీసీలు ఉన్నాయి. ఆయా డీసీలకు ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షుల వివరాలను పట్టికలో చూడొచ్చు.

**గుంటూరు జిల్లాలో...**

| డీసీ పేరు | అధ్యక్షుడు | ఉపాధ్యక్షుడు |
|---|---|---|
| 38-దుగ్గిరాల | జి.అనిల్‌కుమార్ | వి.శేషగిరిరావు |
| 39-కొలకలూరు | జొన్నల మురళీకృష్ణారెడ్డి | తాడిబోయిన నాగేశ్వరరావు |
| 40-తెనాలి | పెమ్మసాని శ్రీనివాసరావు | యలవర్తి రఘుబాబు |
| 45-పొన్నూరు -1 | దేవరపల్లి పవన్‌కుమార్ | బొలగాని రామారావు |
| 46-పొన్నూరు -2 | గనిపిశెట్టి రామకృష్ణ | అన్నవరపు హనుమాయమ్మ |
| 49-చేబ్రోలు | నువ్వుల సునీల్‌చౌదరి | కల్లూరి తిరుపతిరావు |
| 53-గుంటూరు చానల్ -1 | దుద్దుకూరి బూషబాబు | సాధు కొండలరావు |
| 54-గుంటూరు చానల్ -2 | ఉప్పటూరి తిరుపతిరావు | పసుపులేటి శ్రీనివాసరావు |

**బాపట్ల జిల్లాలో...**

| డీసీ పేరు | అధ్యక్షుడు | ఉపాధ్యక్షుడు |
|---|---|---|
| 33-వేమూరు | డి.వెంకటసుబ్బారావు | తోట ఏడుకొండలు |
| 34-కొల్లూరు | యలవర్తి కోటేశ్వరరావు | మల్లంపాటి హరిప్రసాద్ |
| 35-వెల్లటూరు | యర్రంశెట్టి వెంకటకరుణ శ్రీనివాసరావు | వెలగపూడి రవిప్రసాద్ |
| 36-రేపల్లె | యర్రగాల శ్రీనివాసరావు | కూచిపూడి మోహనరావు |
| 37-మోర్తోట | పంతాని మురళీధరరావు | జొన్నా నరసయ్య |
| 41-గోవాడ | మొఖమాటం రాధాకృష్ణమూర్తి | కావూరి సత్యనారాయణ |
| 42-కూచిపూడి | కొరటాల లీలాసత్యసాయి | కేలం శ్రీనివాసరావు |
| 43-పీవీ పాలెం | షేక్ ముంతాజ్‌బేగం | నక్కల పోలిరాజు |
| 44-జాగర్లమూడి | టి.శివారెడ్డి | ఎండీ ఇస్మాయిల్ |
| 47-పొన్నూరు-3 | ఇనగంటి శ్రీకాంత్‌బాబు | బొద్దులూరి వెంకటేశ్వర్లు. |
| 48-బాపట్ల-1 | మల్లారపు శ్రీనివాసరావు | దొప్పలపూడి రాజశేఖర్ |
| 50-బాపట్ల-2 | ఇమ్మిడిశెట్టి మధుసూదనరావు | సీతా ఉపేంద్రరావు |
| 51-చీరాల | నీరుకట్టు పాండురంగారావు | నక్కల నాగరాజు |
| 52-చినగంజాం | పాద వీరయ్య | జాగర్లమూడి సాయిప్రసాద్ |

# ముగ్గురు గంజాయి విక్రేతలు అరెస్టు



రాజుపాలెం: గంజాయి అమ్ముతున్న ఒక మహిళను, ఇద్దరు యువకులను సోమవారం అరెస్టు చేసినట్లు సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. చౌటపాపాయపాలెం గ్రామానికి చెందిన కుందురు దుర్గారావు, క్రోసూరు మండలం పారుపల్లి గ్రామానికి చెందిన పారుపల్లి భూలక్ష్మి, చౌటపాపాయపాలెం గ్రామానికి చెందిన వల్లాల ప్రసాద్ గంజాయి అమ్ముతున్నారనే సమాచారంతో సత్తెనపల్లి రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు, ఎస్ఐ కె.వేణుగోపాల్ తన సిబ్బందితో దుర్గారావు ఇంటిపై దాడిచేసి ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2 కిలోల గంజాయి, 2 సెల్‌ఫోన్లు, రూ.3,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. కొంత కాలం నుంచి దుర్గారావు నర్సీపట్నం మండలం చింతపల్లి గ్రామాల పరిసరప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి తన ఇంటి వద్ద ఉంచుతున్నాడని, దీనిని నిందితులు ముగ్గురూ అమ్ముతున్నారని డీఎస్పీ తెలిపారు. వీరిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

# బార్ అండ్ రెస్టారెంట్‌ల నిర్వహణకు నోటిఫికేషన్

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరులో జిల్లాలో 23 బార్ అండ్ రెస్టారెంట్‌లు, ప్రీమియం లిక్కర్ స్టోర్ నిర్వహణకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. గత ప్రభుత్వంలో హయాంలో మూడేళ్ల కాలపరిమితి (2022–25) బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహించుకునేందుకు టెండర్ ప్రక్రియ నిర్వహించిన విషయం తెలిసిందే. వాటిలో కొన్ని బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు ప్రతి సంవత్సరం లైసెన్స్ రెన్యూవల్ చేసుకోకపోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 23 బార్ అండ్ రెస్టారెంట్లు మిగిలిపోయాయి. అందులో మంగళగిరి తాడేపల్లి మున్సిపాలిటీ పరిధిలో 1, తెనాలిలో 5, పొన్నూరు 2, రేపల్లె 1, పిడుగురాళ్ల 6, మాచర్ల 3, గురజాల 2, దాచేపల్లి 3 ఉన్నాయి. వీటి నిర్వహణకు వచ్చే ఏడాది ఆగస్టు 31వ తేదీ వరకు కాలపరిమితితో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 23న నిర్దేశిత దరఖాస్తు ఫీజు చెల్లించాలి. 24న ఆన్‌లైన్‌లోనే ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బిడ్డింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. ఎక్కువ బిడ్డింగ్ వేసిన వారికి నిర్వహణ లైసెన్స్ ఇస్తామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాస్ తెలిపారు. అదే విధంగా గుంటూరులో ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటుకు ( 5 ఏళ్ల కాలపరిమితితో) కూడా ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతుందని చెప్పారు.